ఇంటర్మీడియట్ సెకండియర్ ఎగ్జామ్స్ అయిపోగానే చాలా మంది విద్యార్థులు కులాసాల విలాసాల్లో తేలుతుంటే మరి కొందరు మాత్రం మెడికల్, ఇంజనీరింగ్ ఎంట్రన్స్‌లకని ట్యూషన్స్ చదువుతున్నారు. ఇంజనీరింగ్ ఎంట్రన్స్‌కని కష్టపడి చదువుతున్న వారిలో సురేష్ ఒకడు. టెన్త్‌క్లాస్‌లో రాష్ట్రస్థాయిలో రాంక్ సంపాదించుకుని కాష్ అవార్డును కూడా అందుకున్నాడు.

ప్రతిరోజు పట్టుదలతో పుస్తకాలతో పట్టుబడుతున్నాడు! రాత్రిపూట కూడా యింట్లోవాళ్ళు మందలించేవరకు నిద్రపోయే వాడు కాదు!

రిజల్ట్స్ మరోవారం రోజుల్లో వస్తాయంటూ పేపర్లో ప్రకటించారు ఏవరేజ్ స్టూడెంట్స్ స్తబ్దుగాను, బిలో ఏవరేజ్ స్టూడెంట్స్ క్లాసులొస్తాయని కాలరెగరేసుకుంటూ, ఇంటెలిజెంట్స్ మాత్రం రాబోయేవిజయానికి హృదయంలోనే స్వాగతం పలుకుతూ తిరుగుతున్నారు!




వారం రోజులు గిర్రున తిరిగాయి. ఓ రోజు ఉదయం.... నగర వీధులలో చిన్న అలజడి అందరూ ఆతృతగా నెంబర్లు చూడ్డం మొదలెట్టారు! పేపరు పట్టుకున్న చేతులు ఒణుకుతున్నాయి కొందరికి. నెంబరు కనిపించకపోగానే చేతిలో శక్తి నశించి పేపర్ని జారవిడుస్తున్నారు ఇంకొందరు.

"నెక్స్ట్ టైమ్ బెటర్ లక్"

"సారీ"

"బేడ్‌లక్."

"ట్రై ఎగెన్."

కామెంట్స్‌తో నిండిపోతున్నాయి స్టూడెంట్ల సమూహాలు!

సురేష్ వాళ్ళ నాన్నగారు పేపర్ తిరగేసి నెంబరుకోసం ఆతృతగా వెతకసాగారు! సురేష్ ప్రక్కనే నిలబడి తను కూడా వెతుకుతున్నాడు! ముందు ఫస్ట్‌క్లాస్ కాలమ్స్‌లో... ఫలితంలేదు.... సురేష్ కళ్ళలో నీళ్ళు తిరిగాయి! రామనాధంగారు మళ్ళీ వెదికారు అదే కాలమ్‌లో....ఆందోళనతో నిండిన హృదయంతో సెకెండ్ క్లాస్ కాలమ్‌వైపు మరలాయి తన కళ్ళు. అక్కడ కూడా నిరుత్సాహం ఎదురైంది. సురేష్ కళ్ళ వెంబడి నీళ్ళు జలజలా రాలాయి! మనస్సు ఒప్పుకోకపోయినా థర్డ్ క్లాస్ కాలమ్‌లో కూడా చూశారు! అంతే రామనాధంగారు దీర్ఘశ్వాస విడుస్తూ కుర్చీ వెనక్కి జారబడిపోయారు! సురేష్ విచారంతో తన గదిలోకి వెళ్ళిపోయాడు.

ఇదంతా గమనిస్తున్న సురేష్ అన్నయ్య రవి ఆ పేపరు తీసుకుని ఆతృతగా వెదికి "నాన్నా తమ్ముడి నెంబరు ఇందులో వుంది చూడండి" అంటూ నవ్వుతూ రామనాధంగారికి పేపరందించాడు! పేపరందుకుని ఆతృతగా చూసిన రామనాధంకి నవ్వాలో, ఏడ్వాలో తెలీలేదు! ఎందుకంటే ఆ నెంబరుమీదున్న హెడ్డింగ్ "మాల్ ప్రాక్టీస్."

పాపం వెంటనే రామనాధనికి ముందెపుడో "బోర్డు వారి లీలలు" అన్న హెడ్డింగ్‌తో చూసిన వార్త గుర్తొచ్చి నీరుగారిపోయారు.

—ఎమ్. రాజేశ్వరరావు (కుసుమ)

